క్లుప్తంగా

యాసిడ్ దాడుల నియంత్రణకు చర్యలు



వర్తకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : యాసిడ్ దాడుల నియంత్రణలో భాగంగా పట్టణంలోని పలువురు వర్తకులతో సీఐ పి.అప్పలరాజు బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని బంగారు వర్తకులు, కళాశాలలకు సంబంధించిన లేబొరేటరీ నిర్వాహకులు, రసాయన విక్రయదారులు, మెడికల్ షాపుల యాజమానులకు రసాయన విక్రయాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సంబంధిత రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని షాపుల ముందు సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

వాడ్రాపల్లిలో మొక్కల పంపిణీ

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో బుధవారం ఆయన వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, స్థానికులకు మొక్కల్ని అందించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

హృద్రోగికి ఆర్థిక సాయం

ఎస్.రాయవరం: గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద కదలేని స్థితిలో ఉన్న దుబాకుల దాసుకి సమతా సైనిక్ దళ్ సభ్యులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. పి.ధర్మవరంలో దాసు ఇంటికి బుధవారం వెళ్లి, పరామర్శించి, నగదు సాయం చేశారు. నిరుపేద దాసుకి ఆరోగ్య శ్రీలో వైద్యం లేకపోవడంతో సొంత ఖర్చుతో శస్త్ర చికిత్స చేయించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయం అందించిన వారిలో సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు జాన్ మెతుషెల, కార్యదర్శి గారా రమేష్, గౌరవ అధ్యక్షుడు నారాయణరావు, జగన్ నేషనల్ సేవా ట్రస్ట్ మహిళా అధ్యక్షులు అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

లాలం కుటుంబానికి కొణతాల పరామర్శ



లాలం కుటుంబ సభ్యులతో కొణతాల రామకృష్ణ

రాంబిల్లి: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ కుటుంబ సభ్యులను బుధవారం లాలంకోడూరులో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పరామర్శించారు. భవానీ భర్త లాలం భాస్కరరావు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో భవానీ కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ లాలం సత్యప్రసాద్ తదితరులున్నారు.

ఒంపోలులో తుప్పల తొలగింపు

మునగపాక: ఒంపోలు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ గంగ్రెడ్డి సూరిబాబు అన్నారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

మునగపాక: రేషన్ డిపో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 23న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల రేషన్ డిపో డీలర్ల సంఘం అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు పిలుపునిచ్చారు. పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం రేషన్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ పెద్దలతో సమావేశమయ్యేందుకు డీలర్లంతా చలో విజయవాడకు తరలివెళ్తున్నట్టు తెలిపారు. సమావేశంలో అచ్యుతాపురం మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు రాజాన శంకర్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు మళ్లీ భంగపాటు తప్పదు

'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట/నక్కపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు లక్షాధికారులవుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మరోసారి భంగపాటు తప్పదని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం పాయకరావుపేట మండలంలోని సత్యవరం, పెదరాంభద్రపురం, నక్కపల్లి మండలంలోని పెదబోదిగల్లం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోను, ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. కొంతమంది నాయకులు తాము అధికారంలోకి వస్తే ఏదో అభివృద్ధి చేస్తాం అని అంటున్నారని, అది అంతా బూటకమేనని ఎద్దేవా చేశారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. రోజురోజుకూ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు.



పెదరాంభద్రపురం సభలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, విద్యార్థులు, రైతుల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, నేరుగా వారి ఖాతాలకే నగదు లబ్ధిని అందించడం ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో అందుకు అవసరమైన కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధ్రువపత్రాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, కార్యాలయాల చుట్టూ తిరగనక్కర్లేకుండా జగనన్న సురక్షలో ఇళ్ల వద్దే అందిస్తున్నట్టు వెల్లడించారు. జగనన్న సురక్షలో భాగంగా వలంటీర్లు, గృహసారథుల వద్ద నమోదు చేసుకున్న సత్యవరం గ్రామంలో 201, పెదరాంభద్రపురంలో 251 దరఖాస్తుదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ ఇసరపు



పెదబోదిగల్లంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, సత్యవరం సర్పంచ్ సకిలేటి రాము, ఎంపీటీసీ సభ్యులు యగదాసు శేఖర్, గొర్ల దుర్గాగోవింద్, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మండల తహసీల్దార్లు కె.జయప్రకాష్, అంబేడ్కర్, ఎంపీడీవోలు ఎ.సాంబశివరావు, సీతారామరాజు, ఈవోఆర్‌డీలు వై.వి.సత్యనారాయణ, వెంకటనారాయణ, సర్పంచ్‌లు గంపల మార్తమ్మ, గారా చక్రవర్తి, త్రిపర్ణ సత్తిబాబు, విజయలక్ష్మి అప్పలరాజు, మున్నీషా, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పర్సన్‌ఇన్‌చార్జి యలమంచిలి తాతబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం, శీరం నర్సింహమూర్తి, గంపల సత్తిబాబు, సూరాకాసుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంక్షేమ లబ్ధి

ధ్రువపత్రాల పంపిణీలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మండలంలోని రేగుపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 802 మంది దరఖాస్తుదారులకు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలిసి వివిధ ధ్రువపత్రాలను అందించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిభ కనబరచిన విద్యార్థికి నగదు సాయం అందించి, అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయలేనన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పైసా అవినీతి లేకుండా అమలుచేస్తున్నారని కొనియాడారు. కోవిడ్ లాంటి ఆర్థిక సంక్షోభం సమయంలో కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్పనాయకుడని కీర్తించారు. విద్యా వ్యవస్థలో మార్పులు, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ సేవలతో దేశం మొత్తం ఏపీ వైపు ఆసక్తిగా చూస్తోందన్నారు. ప్రతిపక్షనాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తదితర ఎందరు కలిసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఆపలేరని జోస్యం చెప్పారు.



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

గత టీడీపీ హయాంలో ఏ ధ్రువపత్రం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి, ముడుపులు ముట్టజెప్పుకున్నా.. పచ్చపార్టీ నాయకులు, కార్యకర్తలకు తప్ప, సామాన్యులకు అందేవి కాదని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి లేకుండా కుల, మత, తరతమ భేదాల్లేకుండా అర్హులందరికీ వారి ఖాతాల్లోనే నగదు జమ అవుతోందన్నారు. ఇందుకు తమ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల పనితీరే కారణమన్నారు.

కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో అప్పలనాయుడు, పార్టీ మండల నాయకులు బొద్దపు యర్రయ్యదొర, సేనాపతి రాము, సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, మండల పరిపాలనాధికారి ప్రసాదరావు సచివాలయ అధికారులు, వలంటీర్లు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని మంగవరంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వర్షంలోనూ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతికి సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలని, అర్హతలుండీ సంక్షేమానికి దూరమైన వారిని గుర్తించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. నాలుగేళ్ల తమ ప్రభుత్వ పాలనలో కుటుంబాల వారీగా అందిన సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు.

అనంతరం స్థానిక సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. జగనన్న కాలనీల్లో భాగంగా ఇళ్ల స్థలాలను దూరంగా కేటాయించారని, దగ్గర్లో స్థలాలను ఎంపిక చేయాలని కోరారు. అన్ని సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించనున్నట్టు ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించ



మంగవరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

నున్న కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. డ్వాక్రా సంఘాల మహిళల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. రానున్న ఎన్నికల్లో కూడా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, ఎంపీటీసీ గూటూరు విజయలక్ష్మి, సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం, నాయకులు కోనే పుత్రరావు, పెనుమత్స నాగేశ్వరరావు, దేవవరపు రమణారావు, బొద్దా శ్రీదేవి, కేశనకుర్తి సత్తిబాబు, దేవవరపు నాగభూషణం, జగతా శ్రీను, కోనే రామకృష్ణ, కోనే శివ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నేడు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ నెహ్రూనగర్ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నెహ్రూనగర్ వార్డు ప్రజలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ, తోటాడ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఆయా సచివాలయాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని, దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు, వివిధ విభాగాల అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు హాజరుకావాల్సిందిగా కోరారు.

జగనన్న సురక్షతో సమస్యల సత్వర పరిష్కారం

రాంబిల్లి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి(కన్నబాబురాజు) అన్నారు. కొప్పుగొండుపాలెం గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుదారులకు పలు రకాల ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పనిచేస్తున్నారని కొనియాడారు. జగనన్న ప్రభుత్వానికి అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అవినీతి, అక్రమాలకు తావులేకుండా అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ ధ్రువపత్రాల కోసం మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, తమ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్ప



కొప్పుగొండుపాలెంలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

లపాటి సుకుమారవర్మ(తేజ), తహసీల్దార్ పి.భాగ్యవతి, ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత డీఎస్ఎన్ రాజు(బుజ్జి), పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కన్నబాబురాజు రాంబిల్లిలో బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

ఎస్.రాయవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా? లేదా? తెలుసుకునేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానోన దోహదపడుతుందని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. చిన గుమ్ములూరు, పి.ధర్మవరం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చినగుమ్ములూరు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాల ద్వారా అనునిత్యం అండగా నిలుస్తోందన్నారు. పేదలకు దోపిడీకి గురవకుండా సచివాలయాలు, వలంటీర్ల సాయంతో సంక్షేమ లబ్ధి శతశాతం ప్రజలకు అందేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతోందన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను ఆమె పంపిణీ చేశారు. పి.ధర్మవరంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ చేతులు మీదుగా జగన సురక్ష కార్యక్రమంలో సిద్ధంగా ఉన్న



చినగుమ్ములూరులో ధ్రువపత్రాలను అందిస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి

ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఐకేపీ ఏపీఎం శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు కళ్యాణి, ప్రసాద్, వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గాడి అప్పలనరసింహం, కలిగట్ల రత్న, పార్టీ నాయకులు వెదుళ్ల బంగారి, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఐ అప్పన్న బాధ్యతల స్వీకరణ

ఎస్.రాయవరం: నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.అప్పన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరి జిల్లా డీసీఆర్బీ నుంచి నక్కపల్లి సర్కిల్‌కి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ నారాయణ రావును అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన అప్పన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సర్కిల్ సిబ్బంది, ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి స్టేషన్ల సిబ్బంది ఆహ్వానం పలికారు.



ఎమ్మెల్యే బాబూరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ

అనాథ బాలల మధ్య పుట్టినరోజు వేడుకలు

యలమంచిలి: పుట్టినరోజు వేడుకలకు ఆడంబరం, అట్టహాసం సర్వసాధారణం. అందుకు భిన్నంగా రాంబిల్లి మండలం, వెంకటాపురంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు, సచివాలయ కన్వీనర్ సారిపల్లి పైడిరాజు నిర్వహించారు. బుధవారం తన కుమారుడు దేవాన్ష్ జన్మదిన వేడుకల్ని మూడు స్వచ్ఛంద సంస్థల్లో, అనాథ బాలలు, మానసిక వికలాంగుల మధ్య నిర్వహించి, వారిలో ఆనందాన్ని నింపారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి ప్రేమ సమాజం, అచ్యుతాపురం మండల కేంద్రంలోని వికలాంగుల పాఠశాల, కొండకర్లలోని మానసిక వికలాంగుల సంస్థ ఇచ్చా ఫౌండేషన్‌లో పుట్టిన రోజు వేడుకల్ని ఘనంగా జరిపారు. కుటుంబ సభ్యులతో కలసి అనాథబాలలకు, మానసిక వికలాంగులకు అన్నసమారాధన నిర్వహించారు. వారికి మూడు



కొండకర్ల మానసిక దివ్యాంగ బాలల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

రోజులకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ చేశారు. అనంతరం ఆయా సంస్థల్లో కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచి, వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కబడ్డీ అప్పారావు పల్లా, కశిరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీలో సరికొత్త చరిత్ర

కోటవురట్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల పక్షమని జగనన్న సురక్ష కార్యక్రమంతో మరోసారి నిరూపించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు అన్నారు. మండలంలోని పాములవాక, అన్నవరం గ్రామాలలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పాములవాక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 11 రకాల సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి (ఎంఏఏఎం) చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించి మ్యుటేషన్ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చే



పాములవాకలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంఏఏఎం చైర్మన్ శ్రీనివాసరావు

దన్నారు. ఇపుడు వలంటీర్లే అడిగి మరీ సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, తహసీల్దారు జానకమ్మ, సర్పంచ్ సత్యవతి, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలకు కృషి

కోటవురట్ల: ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్దను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, హెచ్‌ఎం కె.వి.ఎల్.నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మెరుగైన విద్య

యలమంచిలి: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణం కొత్తపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో అప్పలనాయుడుతో కలసి తనిఖీ చేశారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, వంటగది, బాలికల వసతి గదులను పరిశీలించారు. బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారంపై విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమ అమలుపై సిబ్బందిని ఆరా తీశారు. హాస్టల్‌లో సమస్యలుంటే తనను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థు సంక్షేమానికి వసతి గృహాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద విద్యార్థి మెరుగైన వసతుల మధ్య ఉన్నత చదువులు చదవాలనే నాడు



కొత్తపేట బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

నేడు పథకంలో భాగంగా స్కూళ్లు, వసతి గృహాలను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే పోషకాహారంతోపాటు, ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి ద్వారా ఉత్తమ ఫలితాలు

కోటవురట్ల: గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని డిస్ట్రిక్ట్ రీసోర్స్ సెంటర్ ఏడీఏ పి.శ్రీధరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ బృందం సుంకపూరు గ్రామంలో పర్యటించి విత్తనోత్పత్తి పథకం ద్వారా పోసిన నారు మడులను బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ పథకానికి సుంకపూరు గ్రామాన్ని ఎంపిక చేసి, 25 మంది రైతులతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా విత్తనాలు అందించి ఫలసాయం వచ్చాక, మళ్లీ వారి నుంచే విత్తనాలు సేకరిస్తామన్నారు. రైతులకు రాగులు, కందులు మినీ కిట్స్ అందించారు. డీఆర్సీ ఏవో పి.విజేత, అగ్రికల్చర్ ఏవో సరోజిని, ఏఈవో సాయి వాణి, సర్పంచ్ కాశీలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


పాయకరావుపేట: ప్రతీ ఒక్కరూ మొక్కల్ని నాటి, వాటిని సంరక్షించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. గ్రీన్ మిలీనియంలో భాగంగా పెంటకోట గ్రామంలో బుధవారం ఆయన మొక్కల్ని నాటారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కల్ని నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పెంటకోట గ్రామ ఉప సర్పంచ్ చిక్కాల బాబు, పలువురు డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.



పెంటకోట గ్రామంలో మొక్కల్ని నాటుతున్న చిక్కాల రామారావు

జీజీఎంపీ నిధులతో రోడ్డు పనులు

మునగపాక : గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ) నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పలు పనులు ఈ కార్యక్రమంలో అమలవుతున్నాయి. మండలంలోని పాత నాగవరం రామాలయం నుంచి శ్మశానవాటికకు అవసరమయ్యే రహదారి నిర్మించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీనికి తోడు పంచాయతీ నిధులను జోడించి రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. అధికారుల పర్యవేక్షణలో రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం పనులను పరి



నాగవరంలో శరవేగంగా శ్మశానవాటిక రోడ్డు నిర్మాణం

శీలించేందుకు వచ్చిన మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతోందన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు యాప్

నక్కపల్లి: మండలంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందని గొడిచర్ల జెడ్పీ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయురాలు(ఎస్ఎస్ఏ) షేక్ యాస్మిన్ తెలిపారు. బుధవారం ఆమె వివిధ పాఠశాలలను సందర్శించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను ఆయా ఉపాధ్యాయుల మొబైళ్లలో ఇన్‌స్టాల్ చేశారు. యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మండలంలో 100 మందికి పైగా ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నట్టు తెలిపారు. భవిత కేంద్రానికి విద్యార్థులను తీసుకువచ్చి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హెచ్‌ఎం రమాప్రతాప్, ఎస్ఎస్ఏ సమన్వయకర్త శకుంతలపాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

పాయకరావుపేట : మండలంలో గల పెదరాంభద్రపురం పంచాయతీ, పి.కొత్తూరు గ్రామానికి చెందిన రెడ్డి లావణ్య అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు ఎస్ బి.జోగారావు తెలిపారు. వినందా కాలేజీలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న లావణ్య రోజులానే మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి ఇంటికి రాలేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వలంటీర్ మానవత్వం

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ వలంటీర్ సూరిశెట్టి లక్ష్మీ ప్రసన్న తన మానవత్వాన్ని చాటుకుంది. గ్రామానికి చెందిన గాతాడ నాగరత్నంకు గతంలో వృద్ధాప్య పింఛన్ అందేది. వయస్సు తక్కువ చూపిస్తున్నందున ఆ పింఛన్ ఆగిపోయింది. దీంతో సర్పంచ్ గంగయమ్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఒంటరి మహిళ సర్టిఫికెట్ చేయించి, పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. అయినా సాంకేతిక కారణాలతో ఆమెకు పింఛన్ రాలేదు. దీంతో వలంటీర్ లక్ష్మీ ప్రసన్న ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చేంతవరకు తన జీతంలో నెలకు రూ.వెయ్యి చొప్పున అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు బుధవారం జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ చేతుల మీదుగా మొదటి నెల రూ.వెయ్యి అందించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిశెట్టి రామకృష్ణ, ఉప సర్పంచ్ మందా రాము, గ్రామశాఖ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు, కరోతి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సాయం అందిస్తున్న వలంటీర్ లక్ష్మీప్రసన్న